# 18 కూల్చివేతలు.. 43.94 ఎకరాలు స్వాధీనం

## ప్రభుత్వానికి హైడ్రా ఆపరేషన్ నివేదిక

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ఫిలింనగర్‌లో లోటస్‌పాండ్ పార్కు స్థలం కాంపౌండ్ వాల్ కూల్చివేత మొదలు.. శనివారం మాదాపూర్ ఎన్ కన్వెన్షన్ సెంటర్ నేలమట్టం సహా 18 చోట్ల కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. 43.94 ఎకరాలకు విముక్తి కల్పించింది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఆదివారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో కొనసాగుతున్నది. హైడ్రా రోజుకు 40 నుంచి 50 వరకు అక్రమ కట్టడాలు, కబ్జాలపై ఫిర్యాదులను స్వీకరిస్తున్నది. రంగంలోకి దిగి ఆయా కట్టడాలను నేలమట్టం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో వెలిసిన నిర్మాణాలను కూల్చివేసి 43.94 ఎకరాలకు విముక్తి కల్పించినట్టు హైడ్రా కమిషనర్ తన నివేదికలో పేర్కొన్నారు.

### కూల్చివేతల్లో ప్రముఖుల నిర్మాణాలు

లోటస్‌పాండ్, మన్సురాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, గాజుల రామారం, బాచుపల్లి, చందానగర్, రాజేంద్రనగర్, ఆమీర్‌పేట తదితర ప్రాంతాల్లో వివిధ నిర్మాణాలను నేలమట్టం చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ఇందులో పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరీ సీడ్స్ అధినేత జీవీ భాస్కర్‌రావు, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి సునీల్‌రెడ్డి, ప్రొ కబడ్డీ యజమాని అనుపమ, సినీ నటుడు నాగార్జున, బీఆర్‌ఎస్ నేత రత్నాకర్ రాజు తదితరుల నిర్మాణాలు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. నందగిరి హిల్స్‌లో కబ్జాలను అడ్డుకునేందుకు వచ్చిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో హైడ్రా అధికారులు కేసు నమోదు చేశారు. జంట జలాశయాల పరిధిలో కట్టడాలను హైడ్రా కూల్చివేయడం, పరిధి దాటి చర్యలకు దిగడం పట్ల హైడ్రాపై విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం మాత్రం హైడ్రా పరిధిని మరింత విస్తరించి 111 జీవో పరిధిలో దృష్టి సారించిందన్న చర్చ జరుగుతున్నది.

### హైడ్రా కూల్చివేతల వివరాలు ఇవే

| ప్రాంతం | కూల్చివేతలు జరిపిన తేదీ/తొలగించినవి | ఆక్రమణలు/వాటి విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|---|
| ఫిలింనగర్ కో ఆపరేటివ్ సొసైటీ | జూన్ 27 / 1 | లోటస్‌పాండ్ పార్కు స్థలం కాంపౌండ్ వాల్ /0.16 |
| మన్సురాబాద్/సహస్ర ఎస్టేట్ రోడ్ | 1-7-24/1 | రహదారి ఆక్రమణ/0.2 |
| ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ ప్లాన్ నం 315 | 4-7-24/3 | పార్కు స్థలం కబ్జా/0.06 |
| బంజారాహిల్స్, మిథిలా నగర్ | 5-7-24/2 | పార్కు స్థలం /1.04 |
| ఫిలింనగర్, బీజేఆర్ నగర్ | 14-7-24/1 | నాలా ఆక్రమణ/ 5 |
| గాజుల రామారం, మహదేవ్‌పూర్ | 21-7-24/1 | పార్కు స్థలంలో నిర్మాణాలు /0.01 |
| గాజుల రామారం, భూదేవిహిల్స్ | 23-7-24 /5 | చెరువు ఆక్రమణ /1.1 |
| జూబ్లీహిల్స్ బేబీలాన్ రెస్టారెంట్ | 27-7-24/1 | ఫుట్‌పాత్‌ల ఆక్రమణ /0.05 |
| అమీర్‌పేట నాలా | 3-8-24 /3 | నాలా ఆక్రమణ /0.01 |
| చింతల్ చెరువు, గాజుల రామారం | 6-8-24/54 | చెరువు ఆక్రమణ /3.5 |
| జూబ్లీహిల్స్ నందగిరి హిల్స్ | 9-8-24/16 | పార్కు స్థలం కబ్జా/0.18 |
| రాజేంద్రనగర్, బుమారక్ లేక్ | 10-8-24/45 | చెరువుల్లో ఆక్రమ నిర్మాణాలు/12 |
| చందానగర్/ఈర్ల చెరువు | 10-8-24/ 3 | చెరువుల్లో అక్రమ నిర్మాణాలు /0.16 |
| బాచుపల్లి/ఎర్రకుంట | 14-8-24/3 | చెరువుల్లో అక్రమ నిర్మాణాలు /0.29 |
| బోడుప్పల్ సర్వే నం 3 | 14-8-24/1 | ప్రభుత్వ స్థలం కబ్జా /0.03 |
| ఖానాపూర్, గండిపేట | 18-8-24/14 | చెరువుల్లో భవనాలు /8.75 |
| గండిపేట/చిలుకూరు | 18-8-24/10 | ఉస్మాన్‌సాగర్ చెరువు పరిధిలో నిర్మాణాలు /6.5 |
| ఎన్ కన్వెన్షన్, తుమ్మిడికుంట చెరువు | 24-8-24/2 | చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు/4.9 |
| మొత్తం కాపాడిన స్థలం | | 43 ఎకరాల 94 గుంటలు |




తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

# డైవర్షన్ హైడ్రామా

మొదటిపేజీ తరువాయి...

ఆయన విద్యాసంస్థలపై తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. పల్లా కుటుంబంపై ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. పల్లా విద్యా సంస్థలకు రెవెన్యూ, నీటిపారుదల, హెచ్‌ఎండీఏ, కలెక్టర్ అనుమతులు ఉన్నాయని తెలిపారు. సమస్యల పరిష్కారానికి బదులు సంచలనాల కోసమే ఈ ప్రభుత్వం సమయం కేటాయిస్తోందని విమర్శించారు. పల్లారాజేశ్వర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారుడని, నిజాయితీగా పనిచేసిన నాయకుడని కితాబిచ్చారు. రేవంత్‌రెడ్డి కొందరిని టార్గెట్ చేసుకొని కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని, లేదంటే ఆస్తులు కూల్చేస్తాం, కేసులు పెడతాం అని బెదిరిస్తున్నారని ఆరోపించారు. చీమకు కూడా హాని చేయని పల్లా కుటుంబంలో ఆయన భార్య, పిల్లలపైనా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

### హైడ్రా పేరుతో డ్రామాలు

ప్రత్యర్థులను మానసికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. నోటీసులు ఇవ్వకుండా హైడ్రా పేరుతో డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. పల్లా కాలేజీలు ఒక్క అంగుళం ప్రభుత్వ భూమిలో ఉన్నట్టు చెప్పినా ఆయనే తొలగిస్తారని చెప్పారు. ఆయన మెడికల్ కాలేజీలో ఎంతోమంది వైద్యం పొందుతున్నారని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన కాలేజీలపై దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎఫ్టీఎల్‌లో కానీ, బఫర్‌జోన్‌లో కానీ ఆయన కాలేజీలు లేవని రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ ఇచ్చిన సర్వే రిపోర్ట్‌ను ఆయన మీడియాకు చూపించారు. మెడికల్ కాలేజీ 813/పీ సర్వే నంబర్‌లో ఎలాంటి బఫర్ భూమి లేదని అప్పటి జిల్లా కలెక్టర్ రిపోర్టు ఇచ్చారని తెలిపారు. హెచ్‌ఎండీఏ అనుమతితోనే భవనాలు నిర్మించారని, ఆ భూమిని వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతర భూమిగా 2018 ఏప్రిల్ 30న మార్పు చేశారని తెలిపారు. పల్లాపై జరుగుతున్నది రాజకీయ కుట్రేనని తేల్చి చెప్పారు. అధికారం ఉందని రాత్రికి రాత్రే బుల్డోజింగ్ సరి కాదని హితవు పలికారు.

### మండలి చైర్మన్‌కు డెంగ్యూ

విష జ్వరాలతో ప్రజలు బాధపడుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రత్యర్థుల మీద విషం చిమ్మే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని హరీశ్‌రావు దుయ్యబట్టారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యాలతో ప్రజలు వణికిపోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయని, శాసనమండలి చైర్మన్ కూడా చికున్‌గున్యా బారినపడ్డారని హరీశ్‌రావు తెలిపారు. డెంగ్యూ కేసులో ఈసారి 36 శాతం పెరిగాయని, 5,200 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఉస్మానియా, గాంధీ దవాఖానల్లో సాధారణ మందులు కూడా అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ఒక డ్రైవ్ చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇంట్లోనే మూడు రోజులుగా చెత్త ఎత్తడం లేదని ఆమె చెప్పారని గుర్తు చేశారు.

### రుణమాఫీపై కుంటిసాకులు

రుణమాఫీపై మంత్రులు కుంటిసాకులు చెప్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. పొంగులేటి, ఉత్తమ్, తుమ్మల, భట్టి ఒక్కొక్కరు ఒక్కోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తిచేస్తారో చెప్పాలని నిలదీశారు. రుణమాఫీపై ఆర్మూరులో రైతులు స్వచ్ఛందంగానే రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో రూ. 72 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని, రూ. 30 వేల కోట్ల రుణమాఫీ చేశామని, రూ. 10 వేల కోట్లు రైతు బీమాకు ఖర్చు చేశామని వివరించారు. రేవంత్‌రెడ్డి ద్వంద్వ ప్రమాణాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు నోటితో తిట్టడం తప్ప ఇచ్చిన మాట మీద నిలబడడం చేతకాదని విమర్శించారు. దేవుళ్లనే మోసం చేసిన ఆయనకు ప్రజలను మోసం చేయడం లెక్కకాదని పేర్కొన్నారు. రైతులకు ఇంకా రూ. 14 వేల కోట్లు ఇవ్వాల్సి ఉన్నదని, దేవుళ్లకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఒక్క అంగుళం కూడా బఫర్‌జోన్‌లో లేదు

తాను విద్యా సంస్థలను ప్రారంభించి 25 సంవత్సరాలు అవుతున్నదని, ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ఏనాడూ వ్యక్తిగతంగా, రాజకీయంగా ఇంతగా ఇబ్బందులు పెట్టలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనపైనా, తన కుటుంబంపైనా, తన విద్యా సంస్థలపైనా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రెవెన్యూశాఖ, నీటిపారుదలశాఖ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇంటెలిజెన్స్, పోలీసులు ఇలా అన్ని వ్యవస్థలతో తనను బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తమ కాలేజీ, యూనివర్సిటీ దేశంలోనే ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో ఐదో ర్యాంకులో నిలిచాయని గుర్తు చేశారు. తను కాలేజీ, యూనివర్సిటీకి అనుమతులు ఉన్నాయని, అంగుళం భూమిని కూడా అక్రమించలేదని స్పష్టం చేశారు. తన ముందు సర్వే చేసి అంగుళం భూమి బఫర్‌జోన్‌లో ఉన్నదని చెప్పినా కూల్చివేస్తానని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గట్టు రాంచందర్‌రావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అప్పు రూ. 65 వేల కోట్లు

అప్పుల పేరు చెప్పి ప్రభుత్వం తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 65 వేల కోట్ల అప్పు చేసిందని, అంటే నెలకు రూ.8,125 కోట్ల చొప్పున అప్పు చేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బీఎం కింద రూ. 42,118 కోట్లు, వివిధ కార్పొరేషన్ల నుంచి 22,840 కోట్లు అప్పు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ తన ఐదేండ్ల పాలనలో రూ. 4,87,500 కోట్ల అప్పు చేస్తుందని అంచనా వేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 9 ఏండ్లలో రూ. 4,26,499 కోట్లు మాత్రమే అప్పు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కంటే, మిత్తిలకే ఎక్కువ మొత్తం అవుతుందని భట్టివిక్రమార్క అంటున్నారని, దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. పంచాయతీలు, మున్సిపాలిటిలకు పైసా నిధులు ఇవ్వడం లేదని, పంచాయతీ కార్యదర్శులు మూకుమ్మడి సెలవులు పెట్టాలని నిర్ణయం తీసుకుంటున్నారని తెలిపారు.

### హైడ్రా కూల్చివేతలు సబబే

- సీపీఐ నేత కే నారాయణ



హైదరాబాద్, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ)/మాదాపూర్: హైడ్రాను రాజకీయ కక్ష సాధింపు చర్యలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉపయోగించొద్దని, పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ సూచించారు. సినీ నటుడు నాగార్జున తుమ్మిడికుంట చెరువును కబ్జా చేసి ఎన్ కన్వెన్షన్ సెంటర్ నిర్మించారని ఆరోపించారు. నేలమట్టమైన ఎన్ కన్వెన్షన్ స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. హైడ్రా కూల్చివేతలను స్వాగతిస్తున్నట్టు నారాయణ చెప్పారు. వందల కోట్ల సంపాదన ఉన్న ఎన్ కన్వెన్షన్ అధినేత నాగార్జునకు కక్కుర్తి ఎందుకని నారాయణ ప్రశ్నించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఫంక్షన్ హాలు కట్టడమేమిటని ప్రశ్నించారు. చెరువును ఆక్రమించి నాగార్జున నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌లో సంపాదించిన డబ్బును, నష్టపరిహారంతోసహా కక్కించాలని, అలా వచ్చిన సొమ్ముతో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సభ్యులు పర్వతాలు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, చందుయాదవ్, వెంకట్‌స్వామి తదితరులు ఉన్నారు.

### హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చొద్దు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



నయీంనగర్, ఆగస్టు 25: హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో సామాన్యుల ఇండ్లు కూలగొట్టడం సరికాదని, దశాబ్దాల నుంచి నివసిస్తున్న వారికి అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక పార్టీపై గెలిచి మరో పార్టీలోకి మారే ఎమ్మెల్యేల పదవిని తక్షణమే రద్దు చేసే విధానం రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



కోకాపేటలో హెరిటేజ్ టవర్ శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

# గీతానుసారమే ఆక్రమణల కూల్చివేత

- ప్రభుత్వ భాగస్వాములకు ఫాంహౌస్‌లు ఉన్నయ్
- నాపై ఎన్నో ఒత్తిళ్లు.. అయినా వారినీ వదిలిపెట్ట
- తప్పిదాలెన్నో చేస్తుంటం.. వాటిని సరిదిద్దుకోవాలె
- హెరిటేజ్ టవర్ శంకుస్థాపనలో సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): భగవద్గీత బోధనానుసారమే చెరువులను కాపాడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కోకాపేటలో హరేకృష్ణ ఫౌండేషన్ 430 అడుగుల ఎత్తుతో నిర్మించతలపెట్టిన హెరిటేజ్ టవర్ పనులకు ముఖ్యమంత్రి ఆదివారం శంకుస్థాపన చేసి, మాట్లాడారు. వందేళ్ల క్రితమే హైదరాబాద్‌ను నిజాం లేక్ సిటీగా అభివృద్ధి చేశారని వెల్లడించారు. దాహార్తిని తీర్చే చెరువుల పరిధిలో విలాసాల కోసం కొందరు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారని, గండిపేట్, హిమాయత్ సాగర్‌లోకి ఫామ్‌హౌస్‌ల నుంచి వ్యర్థాలు వదులుతున్నారని తెలిపారు. హైడ్రా ద్వారా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామని, రాజకీయాలు, కక్షల కోసం చేపట్టిన కార్యక్రమం కాదని స్పష్టం చేశారు.

### శాంతిసరోవర్‌కు అండగా ఉంటాం

గచ్చిబౌలిలోని శాంతి సరోవర్ క్యాంపస్‌లో నిర్వహించిన 'బ్రహ్మ కుమారీస్ – శాంతి సరోవర్' ద్వి దశాబ్ది ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. బ్రహ్మకుమారీస్ బాటలోనే తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తున్నదని తెలిపారు. మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహేందర్‌రెడ్డి ఫాంహౌస్

### మిత్రుల ఫాంహౌస్‌లను వదలం

మిత్రుల ఫాంహౌస్‌లు ఉన్నా తొలగించేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్టు రేవంత్ చెప్పారు. ప్రభుత్వంలో భాగస్వాములైనా వాటన్నింటినీ పట్టించుకోదల్చుకోలేదు' అని సీఎం నొక్కి చెప్పారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న వేదికపైనే ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు. కొన్ని రోజులుగా పట్నం మహేందర్‌రెడ్డి ఫాంహౌస్ కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. పట్నం ఫాంహౌస్‌ను కూల్చుతారా? వదిలేస్తారా? అని అక్కడి వచ్చిన ప్రజలు గుసగుసగా మాట్లాడుకోవడం కనిపించింది.

# చిత్రపురికాలనీలో అక్రమ నిర్మాణాలకు నోటీసులు

మణికొండ, ఆగస్టు 25: మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కాలనీలో నిర్మించిన 225 విల్లాలకు నిర్మాణ అనుమతులు లేవని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ ఆదివారం నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం జారీ చేసిన జీవో నంబర్ 658(రెవెన్యూ)కు తూట్లు పొడుస్తూ 225 రో హౌజ్‌ల నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. గత సొసైటీ పాలకవర్గం జీప్లస్1 అనుమతులు పొంది జీప్లస్2 నిర్మాణాలు చేసిందని, 15 రోజుల్లో నోటీసులకు జవాబు ఇవ్వాలని కమిషనర్ తెలిపారు. జవాబు లేనిపక్షంలో కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు.

# సలకం చెరువులో ఓవైసీ కాలేజీ

- సలకం చెరువు సగం ఆక్రమించి ఫాతిమా విద్యాసంస్థలు
- హైడ్రా తరువాతి లక్ష్యం అదేనని జోరుగా ప్రచారం




హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 25 (నమస్తే తెలంగాణ): చెరువుల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలు కూల్చేస్తున్న హైడ్రా తరువాతి లక్ష్యం ఓవైసీ బ్రదర్స్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఓవైసీ బ్రదర్స్‌కు చెందిన అక్రమ కట్టడాలపై ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదులు చేశారు. హైదరాబాద్ జిల్లా పాతనగరంలోని బండ్లగూడ మండల పరిధిలోని సలకం చెరువులో ఓవైసీ బ్రదర్స్ అక్రమంగా విద్యాసంస్థలు నిర్మించారని ఫిర్యాదు చేశారు. చెరువును సగం ఆక్రమించి ఫాతిమా విద్యాసంస్థలు నిర్మించారని అసద్‌పై ఆరోపణలు ఉన్నాయి. చెరువులోనే బిల్డింగులు కనిపిస్తున్నా ఎందుకు కూల్చడంలేదని ఎక్స్‌లో సీఎం రేవంత్‌ను పాతబస్తీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎంపీ అసదుద్దీన్ కూడా హైడ్రా కూల్చివేతలపై స్పందించారు. కొన్ని ప్రభుత్వ భవనాలు కూడా చెరువు ఎఫ్‌టీఎల్‌లో కట్టారని, వాటిని కూల్చుతారా అని ప్రశ్నించారు.

### చెరువుగా గుర్తించిన హెచ్‌ఎండీఏ లేక్ ప్రొటెక్షన్...

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహిస్తున్న లేక్ ప్రొటెక్షన్ వెబ్‌సైట్‌లో బండ్లగూడ మండల పరిధిలోని బండ్లగూడ కల్సా గ్రామ రెవెన్యూ పరిధిలోని సలకం చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి, కెడాస్ట్రల్ మ్యాప్‌లను రూపొందించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. లేక్ గుర్తింపు నంబరుగా 4001/1(13-12-2016) పేరుతో ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను ప్రకటించింది. ఈ చెరువులోనే స్పష్టంగా ఓవైసీకి చెందిన విద్యాసంస్థ ఉన్నట్టు గూగుల్‌మ్యాప్‌లో కనిపిస్తోంది. ఇదే చిత్రాన్ని సోషల్ మీడియాలో పలువురు వైరల్ చేస్తున్నారు.

### జీహెచ్‌ఎంసీ ఆఫీసును కూడా కూల్చేస్తారా?: ఓవైసీ

రాష్ట్రంలో అక్రమ నిర్మాణాలు, కబ్జాలంటూ కూల్చివేతలకు పాల్పడుతున్న హైడ్రాకు చట్టబద్ధత లేదని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఇప్పటికే మేయర్ విజయలక్ష్మిని కలిసి హైడ్రాకు చట్టబద్ధత లేదని వివరించారని తెలిపారు. ఎమ్మెల్యే కౌసర మొయినుద్దీన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి హైడ్రా చట్టబద్ధతను ప్రశ్నించినట్టు చెప్పారు. తన చిన్నతనంలో ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఉన్న ప్రదేశంలో వాటర్‌ఫాల్ ఉండేదని, నెక్లెస్‌రోడ్డు హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండేదని చెప్పారు. హైడ్రా అధికారులు వాటిని కూడా తొలగిస్తారా అని ప్రశ్నించారు. గోల్కొండలో ఉన్న చెరువులో గోల్ఫ్ కోర్స్ ఉన్నదని, అక్కడ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు గోల్ఫ్ ఆడతారని చెప్పారు. కావాలంటే ఆ ఫొటోలు ఇస్తానని తెలిపారు. నిజాంల కాలంలోనే ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన హద్దురాళ్లను ఏర్పాటు చేశారని, అధికారులు వాటిని ఇప్పటికీ చూసుకోవచ్చని పేర్కొన్నారు. మేయర్‌తోపాటు చీఫ్ సెక్రటరీకి ఇదే విషయాన్ని వివరించినట్టు పేర్కొన్నారు.

# హైడ్రా చట్టబద్ధమేనా?

మొదటిపేజీ తరువాయి...

పరిధికి సంబంధించి సరియైన చట్టం చేయలేదని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఉత్తర్వులు ఇస్తే సరిపోదని, సరైన చట్టం కూడా చేయాలని స్పష్టం చేస్తున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ లోపించిందనే కారణంతో హైడ్రాను జీహెచ్‌ఎంసీ పరిధికి మించి ఓఆర్ఆర్ వరకు విస్తరించడం కూడా చట్టబద్ధం కాదని అంటున్నారు. జీహెచ్‌ఎంసీ యాక్ట్ వెలుపల ఉన్న గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలపై రుద్దడం గ్రామ పంచాయతీ యాక్ట్ మున్సిపల్ యాక్ట్‌కు విరుద్ధమని, ఇది ఆయా స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలను ఉల్లంఘించడమేనని పేర్కొంటున్నారు.

### స్థానిక సంస్థల అధికారాల్లో జోక్యం

జీవో-99 ప్రకారం టీసీయూఆర్ పరిధిలో విపత్తుల నిర్వహణ కోసం హైడ్రాను ఓ ఏకీకృత ఏజెన్సీగా ఏర్పాటు చేశారు. ఇది తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1955, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం-2008 తదితర వాటితోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అధికారుల అధికారాలను స్వాధీనం చేసుకున్నది. ఒకవేళ హైడ్రాను ఔటర్ రింగురోడ్డు పరిధి వరకు ఏర్పాటు చేస్తే, అందులోని ప్రస్తుతమున్న జీహెచ్‌ఎంసీ సహా స్థానిక సంస్థల చట్టాల్లో సైతం ఆ మేరకు సవరణలు చేయాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు చెప్తున్నారు. లేనిపక్షంలో ఆయా ఏజెన్సీలకు చెందిన అధికారాల పరిధిలోకి హైడ్రా చొచ్చుకొని పోయినట్లేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అధికారాలకు సంబంధించి సరియైన చట్టబద్ధత లేదని స్పష్టం చేస్తున్నారు.


### ఈవీడీఎం ఉనికి ఉందా, లేదా?

మరోవైపు, విపత్తుల నివారణకు జీహెచ్‌ఎంసీ చట్టం ప్రకారం ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఈవీడీఎం) విభాగం ఉంది. దీని అధికారాలు, విధులకు సంబంధించి స్పష్టత ఉంది. ఈవీడీఎం స్థానంలో హైడ్రాను తెచ్చినప్పటికీ ఈవీడీఎం అధికారాలు రద్దు చేస్తున్నట్టు ఎక్కడా చట్టం చేయలేదు. చట్టబద్ధంగా ఏర్పడ్డ అనేక సంస్థలు, అధికారులను నియంత్రించే అధికారాలు ఎటువంటి చట్టం లేకుండానే హైడ్రాకు కల్పించడాన్ని తప్పుబడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం హైడ్రా వంటి ఏజెన్సీని ఏర్పాటు చేయాలనుకుంటే దాని అధికారాలు, పరిధికి సంబంధించి శాసన ప్రక్రియ ద్వారా కొత్తగా చట్టాన్ని చేసి ఉండాల్సిందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. టీసీయూఆర్ పరిధిని ఓఆర్ఆర్ వరకు నిర్ధారించడంతో అనేక చట్టపరమైన సమస్యలు ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా జీఓ-99లో భాగంగా హైడ్రాకు కల్పించిన అధికారాలకు ఎటువంటి చట్టబద్ధత లేదనని, ఈ జీఓకు సంబంధించి చట్ట పరమైన ఫ్రేమ్ వర్క్ లేదని అంటున్నారు. స్థానిక సంస్థలుగా ఉన్నా ప్రాంతాల్లో హైడ్రా అధికారం చెలాయించడం అక్కడి స్థానిక సంస్థల స్వయంప్రతిపత్తికి, అధికారాలకు భంగం వాటిల్లుతుందని చెప్తున్నారు.

# రాష్ట్ర బీజేపీలో అంతర్యుద్ధం?

మొదటిపేజీ తరువాయి...

అనుమానాలకు తావిస్తున్నది. 'రాష్ట్రం ఏమైనా నీజాగీరా? నువ్వెట్ల కూలగొడ్తవ్?' అని కూల్చివేతల వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డిపై ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'హీరోలా పోజులు కొట్టడం మంచిది కాదు. కూల్చివేతలతో ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నవ్' అని ఫైరయ్యారు. అంతేకాదు, 'కాంగ్రెస్ పార్టీ 30, 40 ఏండ్ల క్రితం అధికారంలో ఉన్నప్పుడు పట్టాలు ఇచ్చిన భూమి ఎఫ్‌టీఎల్ భూమి అని తెల్వదా? ఇప్పుడెట్లా కూలగొడ్తావ్' అని నిలదీశారు. హైడ్రాను అడ్డంపెటుకుని నువ్వు చేస్తున్న దంతా గురించి తాను మాట్లాడబోనని కానీ, ఆ పేరుతో పేదల జోలికి వెళ్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.




కాంగ్రెస్‌కు అనుకూలంగా రఘునందన్‌రావు

ఈటల రాజేందర్ హైడ్రాను ఏకపక్షంగా వ్యతిరేకిస్తే.. ఎంపీ రఘునందన్‌రావు మాత్రం అందుకు విరుద్ధంగా స్పందించారు. కూల్చివేతలు తప్పుకాదన్నట్టుగా మాట్లాడారు. ఎప్పుడో కూల్చాల్సిందని, ఇప్పటికే ఆలస్యమైనట్టుగా చెప్పుకొచ్చారు. హైకోర్టు స్టే ఆదేశాలపైనా స్పందించారు. రాష్ట్ర బీజేపీలో ఇద్దరు కీలక నేతలుగా ఉన్న ఎంపీలు ఇలా పరస్పర విరుద్ధంగా మాట్లాడి ప్రజలను గందరగోళ పరుస్తుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. పార్టీలో ఆధిపత్య పోరుకు ఇది నిదర్శనమని చెప్తున్నారు. ఆయా వర్గాల నేతల రహస్య సమావేశాల్లో జరిగిన చర్చలు, నిర్ణయాల వివరాలు వెంటనే మరో వర్గానికి తెలిసిపోతుండడం, మీడియాకు సైతం లీకవుతుండటం వారిని కలవరానికి గురిచేస్తున్నది. తాజాగా కూల్చివేతలపై ఇద్దరు ఎంపీలు అనుసరిస్తున్న వైఖరి పలు అనుమానాలకు తావిస్తున్నది. మరోవైపు, కర్ణాటకలో వెలుగుచూసిన భారీ కుంభకోణంపై బీజేపీ ఇప్పటి వరకు స్పందించకపోవడంపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# రుణమాఫీ పక్కదోవకే హైడ్రామా

- బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



సంగారెడ్డి ఆగస్టు 25(నమస్తే తెలంగాణ): రుణమాఫీపై రైతుల ఆందోళనలను పక్కదోవ పట్టించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో డ్రామాలు ఆడుతున్నారని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కందిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదులోఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలును విస్మరించి రేవంత్‌రెడ్డి డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి సీఎం తమ్ముడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులపైనా ఆరోపణలు వస్తున్నాయని, వారి నిర్మాణాలను సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు తొలిగించరని ప్రశ్నించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతరులు అక్రమ నిర్మాణాలు చేపట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయని, రేవంత్‌రెడ్డికి దమ్ముంటే వారి భవనాలను తొలిగించాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్‌పై కేసు నమోదు చేసిన ప్రభుత్వం ఆయనను ఎందుకు అరెస్టు చేయటంలేదని ప్రశ్నించారు. చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవటంలేదని నిలదీశారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలో చెరువులను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.